సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ప్రగతినగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ భౌరంపేట్ సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు భౌరంపేట్ గ్రామం, ల్యాండ్ మార్క్–3, సింహపురి కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, జీపీఆర్ లేఅవుట్, భౌరంపేట్ జేఎస్ఎస్ యూఆర్ఎం, శంభీపూర్ గ్రామం, సంస్కృతి విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రేపు ముగ్గుల పోటీలు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని చిత్తరమ్మ దేవినగర్ (పీపీనగర్) రోడ్డు నంబర్.4లో ‘సాక్షి’ ఆధ్వర్యంలో సొంటిరెడ్డి పున్నారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ (ఎస్పీఆర్) సౌజన్యంతో సంక్రాంతి సంబరాల ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 5వ తేదీ గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయని, ఎవరి ముగ్గులు వారే తెచ్చుకోవాలని నిర్వాహకులు తెలిపారు. చుక్కల ముగ్గులకు ప్రాధాన్యత ఉంటుందని, ఉత్తమ ముగ్గులు వేసిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులే కాకుండా పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని తెలిపారు. ఇతర వివరాలకు సెల్: 9666655726, 7989383158 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

యూటర్న్‌ల వద్ద భద్రం సుమా!

కుత్బుల్లాపూర్: సుచిత్ర నుంచి కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు రోడ్డు మధ్యలో ఉన్న యూటర్న్‌లతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. స్థానికంగా ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల యూటర్న్‌లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వేగంగా వచ్చే వాహనాలు పరస్పరం ఢీ కొనడం.. వాహనాలు అదుపు తప్పడం పరిపాటిగా మారింది. దీంతో నిత్యం ఏదో ఒకచోట ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కొంపల్లి నుంచి వచ్చే వాహనాలకు గతంలో 60 స్పీడు ఉండేది. వెన్‌సాయి వద్ద యూటర్న్ ఏర్పాటు చేయడంతో అటువైపుగా వచ్చే వాహనాలు యూటర్న్ వద్ద అదుపు తప్పుతున్నాయి. అదే విధంగా పిస్తా హౌస్ సమీపంలో మరో యూటర్న్ ఉండగా జీడిమెట్ల నుంచి వచ్చే వాహనాలు వేగంగా వచ్చి యూటర్న్ వద్ద పరస్పరం వాహనాలు ఢీ కొంటున్నాయి. ఇదిలా ఉండగా చెన్నై షాపింగ్ మాల్ సమీపం ముందు ఉన్న యూటర్న్ సుచిత్ర నుంచి వచ్చే వాహనాలు ఇక్కడ యూటర్న్ చేస్తూ రాగా జాతీయ రహదారి సుచిత్ర వైపు వెళ్లే వాహనాలు ఇక్కడ ఇబ్బంది పడుతున్నారు. ఇలా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో చోటు చేసుకుంటున్న ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని యూటర్న్ ఏర్పాటు చేయగా అవి ప్రమాదకరంగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

అణగారిన వర్గాల | అక్షర దారి సావిత్రిబాయి

ఆధునిక భారత దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, అణగారిన వర్గాల అక్షరదారి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో సంక్షేమ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జరిపిన వేడుకల్లో ఆమె విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి సావిత్రిబాయి దేశానికి, ముఖ్యంగా మహిళల కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. - కుత్బుల్లాపూర్

- ఘనంగా భారత దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలి జయంతి
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సావిత్రిబాయికి నివాళి

ఆరుట్ల రామచంద్రారెడ్డి భవన్‌లో...



మగ్దూమ్‌నగర్‌లో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు

జగద్గిరిగుట్ట: సమాజ అభ్యున్నతే పరమావధిగా, స్త్రీల హక్కుల కోసం పోరాడిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షురాలు హైమవతి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం మగ్దూమ్‌నగర్‌లోని ఆరుట్ల రామచంద్రారెడ్డి భవన్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు సత్యవతి, చంద్రకళ, గోవిందమ్మ, రాణి, సుశీల, తరంగిణి, పార్వతి, తేజ, రమణమ్మ, శ్రీదేవి, ధనమ్మ, లియోనా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నార్త్ సిటీ హైస్కూల్‌లో...

సుభాష్‌నగర్: సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలో స్కూల్ కరస్పాండెంట్ కోల వెంకటేష్‌ముదిరాజ్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో..

బాచుపల్లి మండలం రాజీవ్ గాంధీనగర్‌లో...



బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో..

నిజాంపేట్: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బాచుపల్లి మండల పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో సీపీఐ మాజీ వార్డు సభ్యుడు డిలేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశి యాదయ్య, మల్లయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పుట్టిన రోజును పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన తెలంగాణ సాయి ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం పూరిలో ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ చేత రూపొందించిన సైకత శిల్పం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సైకత చిత్రంపై ‘అబ్కీ బార్ కిసాన్ సర్కార్’ అంటూ ఒకవైపు.. మరోవైపు కేసీఆర్, కేటీఆర్ చిత్రాలు, అదే విధంగా శంభీపూర్ రాజు చిత్రంతో పాటు హ్యాపీ బర్త్‌డే చెబుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. - కుత్బుల్లాపూర్



సమస్యలతో విద్యార్థుల సహవాసం



పాఠశాలను సందర్శించిన సొంటిరెడ్డి పున్నారెడ్డి

సుభాష్‌నగర్: సమస్యలతో సహవాసం చేస్తున్న విద్యార్థులకు ఎస్పీఆర్ ట్రస్టు అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలపై డిసెంబర్ 31న ‘సౌకర్యాలు దండిగా నిర్వహణ అధ్వానంగా’ అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి స్పందించారు. మంగళవారం స్థానికులతో కలిసి పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని కరెంట్ బిల్లు కట్టకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు 2021 ఫిబ్రవరి నెలలో కరెంటు తొలగించడం వల్ల సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీంతో పున్నారెడ్డి స్పందించి ట్రస్ట్ తరపున విద్యుత్ శాఖకు బకాయిలు చెల్లించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న బాలానగర్ ఏసీపీ గంగారామ్, జీడిమెట్ల సీఐ పవన్, జగద్గిరిగుట్ట సీఐ సైదులు తదితరులు. - కుత్బుల్లాపూర్

అటవీ శాఖ దౌర్జన్యంపై రిలే నిరాహార దీక్ష

సుభాష్‌నగర్: బలిమెల బాధిత కుటుంబ సభ్యుల మీద అటవీ శాఖ అధికారుల దౌర్జన్యానికి నిరసనగా మైత్రి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. 2008 జూన్ 29న ఒడిశా రాష్ట్రంలో నక్సలైట్ ఘాతుకానికి విధి నిర్వహణలో ఉన్న 33 మంది గ్రేహౌండ్స్ బలగాలు ప్రాణాలు కోల్పోయారు. అప్పటి సీఎం దివంగత నేత వైఎస్సార్ ఆదేశాలతో గాజులరామారంలోని సర్వే నంబర్.16లో 33 మంది పోలీసు కుటుంబాలకు ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున 3.10 ఎకరాలను కేటాయించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2014 సెప్టెంబర్ 30న ఇరు రాష్ట్రాల డీజీపీలు, కలెక్టర్ చేతుల మీదుగా మైత్రి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ నామకరణం చేసి ప్లాట్లు అందజేశారు. డిసెంబర్ 18న వీరికి కేటాయించిన స్థలంలో తమ శాఖకు చెందిన ఎకరా స్థలం ఉందంటూ ఫారెస్ట్ అధికారులు ప్రహరీ నిర్మాణానికి పూనుకున్నారు. 19న సొసైటీ సభ్యుల అడ్డుకుని జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. సర్వే చేసేంత వరకు ఎవరు ఏ నిర్మాణం చేపట్టొద్దని పోలీసులు తేల్చి చెప్పారు. అనంతరం సొసైటీ సభ్యులు జాయింట్ కలెక్టర్ నరసింహారెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా జిల్లా అటవీ శాఖ అధికారితో మాట్లాడారని, జేసీ ఆదేశాలతో తిరిగి నిర్మాణాలు చేపడుతుంటే అటవీ శాఖ అధికారులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్ తరలించారని బాధితులు పేర్కొన్నారు. అనంతరం జేసీ చొరవతో పోలీసులు వదిలేశారని, అయినప్పటికీ అటవీ శాఖ అధికారులు తమ స్థలాల్లో ఇళ్లను కట్టుకోనీయకుండా అడ్డుకుంటున్నారని, దీనికి నిరసనగా రిలే నిరాహార దీక్ష చేపట్టినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. మా సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఇరు రాష్ట్రాలకు చెందిన 33 మంది ఇక్కడే వంటావార్పు చేసుకుని దీక్షలో పాల్గొంటామని స్పష్టం చేశారు.

అంతిమ సంస్కారాలకు శెట్టిబలిజ సంఘం చేయూత

కుత్బుల్లాపూర్: చింతల్ శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు అంతిమ సంస్కారాలకు చేయూతనందించి తమ ధాతృత్వాన్ని చాటుకున్నారు. చింతల్ వెంకటేశ్వరనగర్‌లో ఉంటున్న భీమవరం ప్రాంతానికి చెందిన ఆకురాతి శ్రీనివాస్ అకస్మిక మరణం చెందాడు. అతడి కుటుంబం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో ఈ విషయం తెలుసుకున్న చింతల్ శెట్టిబలిజ సంఘం సభ్యులు తమ సొంత ఖర్చులతో మంగళవారం మృతుడికి దహన సంస్కారాలు చేయించారు. కార్యక్రమంలో చింతల్ శెట్టి బలిజ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు గుబ్బల సత్యనారాయణ, శీలం శ్రీనివాసరావు, దూనబోయిన శివశంకర్, బొంతు వెంకటేశ్వరరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, కుడిపూడి త్రినాథ్, కుడిపూడి విజయ్‌కుమార్, అప్పారి ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య



హారతి (ఫైల్)

జీడిమెట్ల: మానసికంగా బాధపడుతున్న ఓ బాలిక ఉరి వేసుకుని మృతిచెందిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన పెంద్ర రాములు 15 ఏళ్ల క్రితం కుటుంబంతో సహా నగరానికి వలసవచ్చి కుత్బుల్లాపూర్ హెచ్ఎంటీ ప్రాంతంలో గుడిసెలో ఉంటున్నాడు. రాములు అక్కడే ఫుట్‌పాత్‌పై ప్లాస్టిక్ డ్రమ్ములు, బకెట్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. రాములుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి చిన్న కుమార్తె అయిన హారతి(16) ఇటీవల ఓ అబ్బాయిని ప్రేమిస్తోందని తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు ఆమెను మందలించారు. అప్పటి నుంచి హారతి మానసికంగా బాధపడుతూ ఉంది. మంగళవారం ఉదయం హారతి వారు ఉంటున్న గుడిసెలోని కర్రకు చున్నీతో ఉరి వేసుకుంది. కొద్దిసేపటి రాములు లోపలికి వెళ్లి చూడగా హారతి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా హారతి అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కుల అభివృద్ధి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవికిరణ్

నిజాంపేట్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడానికి పార్కులను అభివృద్ధి చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 11వ డివిజన్ కార్పొరేటర్ రవికిరణ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పార్కు అభివృద్ధి పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నామని, ఇందులో భాగంగా పలు పార్కులను అభివృద్ధి చేయనున్నామన్నారు. కాలనీవాసులకు ఆహ్లాదాన్ని పంచడానికి పార్కుల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పిల్లలకు ఆట వస్తువులను అమర్చుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, డీఈ సుదర్శన్, ఏఈ ధీరజ్, ఫీల్డ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఇంజినీర్ శివ, కాలనీవాసులు ఉన్నారు.

ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



పనులను పరిశీలిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి బాలచందర్

దుండిగల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని అభయ ఫౌండేషన్ ప్రతినిధి బాలచందర్ అన్నారు. మంగళవారం భౌరంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించేందుకు 6 కంప్యూటర్లు అందించామని, సైన్స్ ల్యాబ్, లైబ్రరీల నిమిత్తం మూడు షెడ్లు నిర్మించామని, టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు తమ ఫౌండేషన్ పని చేస్తుందన్నారు.

చెట్టుకు ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



చంద్రశేఖర్ మృతదేహం

దుండిగల్: ఓ గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి క్రాంతినగర్‌లో ఓ వ్యక్తి చెట్టు ఉరి వేసుకున్నాడని గొల్ల జానయ్య అనే వ్యక్తి 100కు కాల్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీసులు చెట్టుకు వేలాడుతున్న వ్యక్తిని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అతడి వివరాల కోసం వెతకగా ప్యాంట్ జేబులో ఆధార్, పాన్, ఇతర ఐడీ కార్డుల ఆధారంగా జామి చంద్రశేఖర్‌గా గుర్తించారు. కాగా అతడి ఇతర వివరాలు, చిరునామా తదితర విషయాలు తెలియ రాలేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీ..

- తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి

నిజాంపేట్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయపడి మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నర్సారావుపేట్‌కు చెందిన రాము(53) కుటుంబం బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి ప్రగతినగర్ కమాన్ సమాపంలో పాత ఫర్నీచర్ దుకాణంలో పని చేస్తూ స్థానికంగా అక్కడే ఉంటున్నాడు. రాముతో పాటు అతడి ఇద్దరు కుమారులు సైతం ఫర్నీచర్ దుకాణంలో పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి 6.30 గంటల ప్రాంతంలో రోడ్డు దాటుతున్న రామును గండిమైసమ్మ నుంచి బాచుపల్లి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.